మురుగుకు అడ్డుకట్టేదీ?

- నిత్యం రోడ్లపై పారుతున్న డ్రైనేజీ నీరు
- సమస్య పరిష్కారంపై అధికారుల నిర్లక్ష్యం
- దుర్గంధంతో జనం అవస్థలు



ఎన్జీఓస్ కాలనీలోని లేబర్ అడ్డా వద్ద రోడ్లపై పారుతున్న మురుగునీరు

ఎల్బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ పరిధిలోని లేబర్ అడ్డా వద్ద నిత్యం మురుగునీరు రోడ్ల పైకి రావడం వల్ల కాలనీవాసులు, పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటర్ వర్క్స్ అధికారులు మురుగు నీరు పారకుండా చర్యలు తీసుకోకపోవడంతో దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయకపోవడంతో మట్టి పేరుకపోయి మురుగునీరు ప్రతి రోజూ రోడ్లపై పారుతోంది. వాటర్ వర్క్స్ అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోని కారణంగా నిత్యం అక్కడ దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో కాలనీవాసులే కాకుండా నిత్యం వందల సంఖ్యలో వివిధ పనుల కోసం వచ్చి అక్కడ నిల్చునే కార్మికులు సైతం దుర్వాసనతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారులు కేవలం కార్యాలయానికే పరిమితం అవుతున్నారని, క్షేత్ర స్థాయిలో సమస్యలపై ఆరా తీయకపోవడంతో ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వాటర్ వర్క్స్ అధికారులు రోడ్లపై మురుగునీరు పారకుండా వెంటనే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పెట్రోల్ లేక వాహనదారుల అవస్థలు



సైదాబాద్ శంకేశ్వరబజార్ పెట్రోల్ బంక్ వద్ద బారులుదీరిన వాహనాలు

సైదాబాద్: పెట్రోల్, ఆయిల్ ట్యాంకర్ల యజమానుల ధర్నా ప్రభావంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మంగళవారం మధ్యాహ్నం వరకు బంకుల్లో కొంత సాఫీగా సాగిన పెట్రోల్ విక్రయాలు జరిగాయి. సాయంత్రం అయ్యేసరికి స్టాక్ అయిపోవడంతో పెట్రోల్ బంక్ యజమానులు బంకులను మూసివేసి నోస్టాక్ బోర్డులు పెట్టారు. ఎలాంటి సమాచారం లేకుండా బంకులు మూసివేయడంతో వాహనదారులు పెట్రోల్ కోసం పలు బంకుల చుట్టూ చక్కర్లు కొట్టారు. కొన్ని బంకులు మూసేసి ఉన్నప్పటికీ వాహనదారులు క్యూ కట్టారు. బంక్‌లో పెట్రోల్ స్టాక్ లేదని నిర్వాహకులు స్పష్టం చేయడంతో నిరాశతో వెనుదిరిగారు. సైదాబాద్‌లోని శంకేశ్వరబజార్ పెట్రోల్ బంక్ సహా పలు బంకుల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించి స్టాక్ లేదని చెప్పి వాహనాదారులను పంపేశారు. నగరంలోనే దూరప్రాంతాలకు వెళ్లాల్సిన వాహనదారులు తమ గమ్యస్థానాలకు ఎలా చేరుకోవాలని వాపోయారు.

అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే చర్యలు: దర్పల్లి



హిజ్రాలను హెచ్చరిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి హిజ్రాలను హెచ్చరించారు. ఎల్బీనగర్ సాగర్ రింగ్ రోడ్డు, బైరామల్‌గూడ చెరువు సమీపంలో హిజ్రాలు యువకులను, వాహనదారులను ఇబ్బంది పెడుతున్నారని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని కార్పొరేటర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆయన సోమవారం రాత్రి హిజ్రాలను కలిసి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువకులను, వాహదారులను హిజ్రాలు ఇబ్బందులకు గురి చేస్తే పోలీసులు వెంటనే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి చర్యలు మానుకోవాలని, బలవంతపు వసూళ్లకు పాల్పడవద్దని హిజ్రాలకు ఆయన సూచించారు. కార్యక్రమంలో శ్రీనాథ్, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన బోరు పనులు పూర్తి చేయాలి



నందనవనం శ్మశానవాటికలో బోరు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుజాతా నాయక్

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. మంగళవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీలోని శ్మశాన వాటికలో బోరు వేసే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, చాలా కాలం క్రితం జీహెచ్‌ఎంసీ నుంచి నిధులు మంజూరైనా సాంకేతిక కారణాల వల్ల పనులు ప్రారంభం కాలేదన్నారు. శ్మశాన వాటికలో నీరు లేకపోవడంతో అంత్యక్రియల కోసం వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తాను అధికారుల దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. స్పందించిన అధికారులు కాంట్రాక్టర్ వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారని ఆమె చెప్పారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ బోరు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో శ్మశాన వాటిక అధ్యక్షుడు దయ్యాల వెంకటేశ్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నరసింహ, సతీష్‌గౌడ్, రేణుకగౌడ్, మమత మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సైదాబాద్‌లోని విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

ట్రాన్స్‌కో డీఈకి కార్పొరేటర్ వినతి



ఆస్మాన్‌ఘడ్ డీఈకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన్ పరిధిలోని పలు విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి ట్రాన్స్‌కో అధికారులను కోరారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డీఈ హన్మంత్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సైదాబాద్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న సిమెంట్ విద్యుత్ పోల్స్, మీటర్ ఐరన్‌బాక్స్‌లను తొలగించాలని కోరారు. అవసరమైన చోట్ల బంచ్ కేబుళ్లు ఏర్పాటు చేయాలన్నారు. పలు ప్రాంతల్లో స్ట్రీట్‌లైట్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. శిథిలావస్థకు చేరుకున్న ఇనుప స్తంభాలను వెంటనే తొలగించాలని కార్పొరేటర్ వివరించారు. తమ వినతులకు డీఈ సానుకూలంగా స్పందించారని త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో దిలీప్,సుభాష్,శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



నారాయణగూడ ఐపీఎంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

కాచిగూడ: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ ఎల్లప్పుడూ ముందుంటుందని టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు, టీఎన్జీవోస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎం.సత్యనారాయణ గౌడ్ అన్నారు. టీఎన్జీవోస్ ఐపీఎం యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం నారాయణగూడలోని ఐపీఎంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి ప్రసంగించారు. అనంతరం ఐపీఎం డైరెక్టర్ డాక్టర్ సి.శివలీలను టీఎన్జీఓస్ నేతలు కలిసి బొకే అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఐపీఎం డాక్టర్ అన్నపూర్ణ, టీఎన్జీఓస్ నేతలు జి.మల్లారెడ్డి, రాజేశ్వర్ రావు, యూనిట్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి ప్రదీప్, పి. శ్రీరామ్, ప్రశాంత్, రమేష్ బాబు, రమేష్, పద్మావతి, భారతి, సబిత, హబీద్, జహంగీర్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఆహ్వానం



సీఎం రేవంత్ రెడ్డిని డైరీ ఆవిష్కరణకు ఆహ్వానిస్తున్న టీఎన్జీఓ నేతలు

కాచిగూడ: టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం 2024 డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కోరుతూ మంగళవారం టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో సెంట్రల్ యూనియన్ అసోసియేట్ ప్రెసిడెంట్, టీఎన్జీఓస్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ముత్యాల సత్యనారాయణ గౌడ్, యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా హిందీ మ్యూజికల్ నైట్

చిక్కడపల్లి: ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పి.వెంకటేశ్వర్‌రావు నిర్వహణలో బుధవారం మెగా హిందీ మ్యూజికల్ నైట్ శీర్షికతో సంగీత విభావరిని నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గాయని ఆమని తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 3న మధ్యాహ్నం త్యాగరాయ గానసభలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు స్నేహమిత్ర అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 23, వంకాయ 45, బెండ 50, పచ్చిమిర్చి55, కాకర 58, బీర 50, క్యాలీఫ్లవర్ 25, కేబేజీ 16, క్యారెట్ 37. దొండ 45, ఆలు 26, ఉల్లి 24, గోకర 60, దోస 40, సొర 15, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 60, అర్వి 55, మునగ 75, చిలగడదుంప 50, బీట్‌రూట్ 25, కీర 15, ఫ్రెంచ్ బీన్స్ 55, కాప్సికమ్ 70. ఈ ధరలు బుధవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

దుర్గాదేవి ఆలయ కేలండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ నాయకులు

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్‌కాలనీలోని శ్రీదుర్గాదేవి ఆలయ నూతన సంవత్సర కేలండర్‌ను ఆలయం కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యాదగిరి, హనుమంతరావు, కృష్ణమూర్తి, మురళి, రమణమూర్తి, ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత మగ్గం, జర్దోసి శిక్షణ తరగతులు

వనస్థలిపురం: శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, వనస్థలిపురం ఆధ్వర్యంలో నైపుణ్యత అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 నుంచి మహిళలకు ఉచిత మగ్గం, జర్దోసి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు సేవా సమితి ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల మహిళలు అర్హులని, వనస్థలిపురంలోని శ్రీ సత్య సాయి ప్రేమ సేవా సదన్‌లో 45 రోజుల పాటు వారికి శిక్షణ తరగతులు ఉంటాయని వారు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు వివరాలకు ఫోన్: 9493132518లో సంప్రదించాలన్నారు.

పగలే వీధి దీపాల వెలుగులు!



హస్తినాపురం సెంట్రల్‌లో పగటి పూట వెలుగులు జిమ్ముతున్న స్ట్రీట్‌లైట్

వనస్థలిపురం: వనస్థలిపురం, హస్తినాపురం డివిజన్లలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. కాలనీలలో రాత్రి వేళ వెలగాల్సిన వీధి దీపాలు పగలే వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఇది నిత్యం ఏదో ఒక కాలనీలో పరిపాటిగా మారింది. దీంతో విలువైన విద్యుత్ వృథా అవుతోంది. ఈ విషయమై కాలనీల ప్రజలు ఫిర్యాదు చేసినా, పత్రికలలో వార్తలు వచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత విభాగం ఉన్నతాధికారులు స్పందించి వీధిదీపాలు పగలు కాకుండా కేవలం రాత్రిపూట మాత్రమే వెలిగేలా చర్యలు తీసుకోవాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

బాప్టిస్టు చర్చిలో క్రిస్మస్ విందు



క్రిస్మస్ విందులో అన్నం వడ్డిస్తున్న పాస్టర్ సాల్మన్ బోడ తదితరులు

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చిలో మంగళవారం ప్రభుత్వ క్రిస్మస్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ రెవరెండ్ బోడ సాల్మన్ బైబిల్ లేఖనాలు బోధించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రజలందరికీ చేరాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి వర్గం, అధికార యంత్రాంగం విజయవంతంగా ప్రజలకు సేవలందించాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం క్రిస్మస్ విందు ప్రారంభించారు. కార్యక్రమంలో పాస్టర్ ఆంధ్రయ్య, చర్చి కమిటీ సభ్యులు రాణిప్రమీల, వెంకటరత్నం, ఎస్. ఇజ్రాయేల్, బాబూరావు, బాలసుందరం, ఆంద్రూస్, యువరాజ్, లూక్ ఆనందరావు పాల్గొన్నారు.

నాడు ఉద్యమం..నేడు ఉత్సవం

అయోధ్యలో శ్రీరామ మందిరం నిర్మాణంపై బీజేపీ నేత ఆనందం



మీర్జాపూర్ జైల్లో అందజేసిన పత్రాన్ని చూపిస్తున్న సహదేవ్‌యాదవ్

చంచల్‌గూడ: అయోధ్యలో శ్రీరామ మందిరం నిర్మాణం జరిగి ప్రారంభానికి సిద్ధం కావడం ఎంతో సంతోషంగా ఉందని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, కుర్మగూడ మాజీ కార్పొరేటర్ కుసురు సహదేవ్‌యాదవ్ అన్నారు. అయోధ్య ఉద్యమంలో 18 రోజుల పాటు జైలు జీవితం గడిపినట్లు ఆయన తెలిపారు. అయోధ్య ఉద్యమం తీవ్రతరం కావడంతో పాతబస్తీ నుంచి 1990 లో కరసేవకు వెళ్లగా అప్పటి యూపీ ప్రభుత్వం తనను అరెస్ట్ చేసి 18 రోజులు మీర్జాపూర్ జైల్లో పెట్టిందని గుర్తు చేశారు. 22 ఏళ్ల వయస్సులో తాను అయోధ్య ఉద్యమమంలో పాల్గొని జైలుకు వెళ్లడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. పాతబస్తీ నుంచి ఎంతో మంది యువకులు అప్పట్లో కరసేవకు వెళ్లివచ్చినట్లు గుర్తు చేశారు. నాడు ఉద్యమంలో జైలుకు వెళ్లి..నేడు శ్రీరామ మందిర ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఉత్సవాలు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. అయోధ్య ఉద్యమంలో ఎంతోమంది తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. బాబ్రీ గుమ్మటును కూల్చిన ఉప్పరిగూడకు చెందిన బాలరాజ్‌యాదవ్ ను మరో వర్గం వారు అతికిరాతకంగా హత్య చేసినట్లు గుర్తు చేశారు.

ప్రజాపాలనకు అపూర్వ స్పందన

వెల్లువెత్తిన దరఖాస్తులు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని 4, 12, 27, 29 డివిజన్లలో ప్రజాపాలన సభలను మంగళవారం జిల్లా పరిశ్రమల సంస్థ జనరల్ మేనేజర్, ప్రజాపాలన జిల్లా ప్రత్యేక అధికారి రాజేశ్వర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఇచ్చిన దరఖాస్తు ఫారాలను ఆయన పరిశీలించారు. ప్రజాపాలనకు సంబంధించి అధికారులు, సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ అల్లూరి వాణి, మేనేజర్ ఎన్.వెంకట్‌రెడ్డిలు ఉన్నారు.

కేంద్రాల పరిశీలన

తుక్కుగూడ: ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు రోజులో 15 వార్డుల నుంచి 5,808 దరఖాస్తులు వచ్చాయన్నారు. అర్హులైన వారు ఈనెల 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటేషం, సిబ్బంది జంగయ్య, మల్లేష్, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనర్హులు రేషన్ కార్డు రద్దు చేసుకోవాలి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో మంగళవారం 15,16,17,18 డివిజన్లకు సంబంధించి ప్రజాపాలన కార్యక్రమాన్ని తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. దీనికి డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ హాజరై దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలో ప్రభుత్వం అందచేయాలనుకుంటున్న తెల్లరేషన్ కార్డులు.. అవసరం లేనివారు వదులుకోవాలని కోరారు. ఆర్థికంగా బాగా ఉన్న వారు తెల్ల రేషన్‌కార్డును రద్దు చేసుకుంటే నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. పేదల గురించి ఆలోచించే నాయకులు, ధనవంతులు తెల్లరేషన్ కార్డును వదులుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ సుమన్‌రావు, కార్పొరేటర్లు ప్రభాకర్‌రెడ్డి, మహేశ్వరిజైహింద్, డీఈఈ జ్యోతిరెడ్డి, బాలాపూర్ వాసులు పాల్గొన్నారు.



మీర్‌పేట: దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రత్యేక అధికారి రాజేశ్వర్‌రెడ్డి

సరూర్‌నగర్ చెరువును సుందరీకరించాలి



సరూర్‌నగర్ చెరువు వద్ద గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: సరూర్‌నగర్ చెరువులోని గుర్రపు డెక్కను తొలగిస్తే సమీప కాలనీలకు దోమల బెడద నుంచి విముక్తి కలుగుతుందని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఎఫ్‌టీసీ యంత్ర సహాయంతో చెరువులోని గుర్రపు డెక్క తొలగించే పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో ఎఫ్‌టీసీ యంత్రం ఒక్కటే ఉండటం , చెరువు సుందరీకరణ పనులకు నోచుకోక పోవటం వల్ల లోతట్టు కాలనీలలో ప్రజలు దుర్వాసన, దోమల వ్యాప్తితో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యపై అనేక పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి పనులు నోచుకోకపోవటం బాధాకరం అన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం అయినా సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్‌ను అభివృద్ధి చేసి సుందరీకరణ చేయాలని కార్పొరేటర్ కోరారు. కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ రాంబాబు, అర్జున్, స్థానిక నాయకులు దాసరి జయప్రకాష్, శ్రవణ్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, హరీష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

దత్తాత్రేయ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులతో కాలనీవాసులు

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్‌లోని దత్తాత్రేయ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నట్లు ఎన్నికల నిర్వాహకులు ఉపేందర్, సైదులు తెలిపారు. బ్యాలెట్ పద్ధతిలో జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా డి.రమేష్, ఉపాధ్యక్షుడిగా టి.శోభన్, ప్రధాన కార్యదర్శిగా పి.వెంకట్‌రెడ్డి ఎన్నికయ్యారని చెప్పారు. నూతన అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ... కాలనీలో పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బి.కిరణ్‌కుమార్, ఎం.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలు అందజేత



కార్యక్రమంలో పాల్గొన్న శ్రీరామ భక్తులు

చంపాపేట: చంపాపేట డివిజన్ సాయిరాంనగర్ కాలనీలో మంగళవారం అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ పూజిత అక్షింతలను ఇంటింటికీ అందజేశారు. కాలనీవాసులు సాంప్రదాయ దుస్తులు ధరించి భక్తి శ్రద్ధలతో పూజిత అక్షింతల కలశానికి నమస్కరించి అక్షింతలు అందుకున్నారు. రామభక్తుల శ్రీరామ, హరినామ స్మరణలు, సంకీర్తలు, భజనలు చేస్తూ వాటిని కాలనీవాసులకు అందజేశారు. కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయ చైర్మన్ నల్లా రఘుమారెడ్డి, స్థానిక కాలనీవాసులు సుఖజీవన్‌రెడ్డి, ముకుందరెడ్డి, చంద్రపాల్‌రెడ్డి, రఘునందన్ రావు, శేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సర్వేష్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా సంస్థాన్‌కు ఐఎస్‌ఓ సర్టిఫికెట్



ఐఎస్‌ఓ సర్టిఫికెట్ అందుకుంటున్న ఆలయ చైర్మన్ గుండ మల్లయ్య

చైతన్యపురి: దక్షిణ షిరిడీగా ప్రసిద్ధి పొందిన దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ మంగళవారం ఐఎస్‌ఓ సర్టిఫికేట్ అందుకుంది. సోమవారం హెచ్‌వైఎం ఇంటర్‌నేషనల్ బృందం సభ్యులు సాయిబాబా ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలోని అన్ని అంశాలను పరిశీలించారు. మంగళవారం బాబా సమక్షంలో ఆలయ చైర్మన్ గుండ మల్లయ్యకు ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. అలాగే ఆహార నాణ్యతకు ఫుడ్ సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షుడు బీవీ శ్యామ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి. లక్ష్మీదుర్గ, కార్యవర్గ సభ్యులు కె.రాజశేఖర్, బి.కిరణ్‌కుమార్, గౌరవ సలహాదారు పి.రఘుకుమార్, ఆర్థిక కార్యదర్శి ఆర్‌ఎస్ శంకరరావు, జాయింట్ సెక్రటరీలు వీవీ రవికుమార్, ఎం.శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఎక్కబోతూ వృద్ధుడి మృతి

కాచిగూడ: రైలు ఎక్కబోతూ ప్రమాదవశాత్తు జారి పడి ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా, అవంతినగర్ ప్రాంతానికి చెందిన గోవిందు (73) గుంతకల్ వెళ్లేందుకు కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు



మన్సూరాబాద్: గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ , ప్రముఖ కళాకారులు, సామాజిక కార్యకర్త డాక్టర్ పెండెం కృష్ణకుమార్ మంగళవారం రాష్ట్ర డీజీపీ రవిగుప్తాను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి క్లాత్ బ్యాగులను అందజేశారు.